క్లుప్తంగా

సందేహాలు నివృత్తి చేసుకోండి

పీవోలు, ఏపీవోలతో కలెక్టర్ మల్లికార్జున



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట : ఎన్నికల విధుల్లో పాల్గొనే పీవోలు, ఏపీవోలు సందేహాలుంటే శిక్షణ శిబిరాల్లో నివృత్తి చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున సూచించారు. దక్షిణ నియోజకవర్గ పరిధిలో ఎన్నికల విధులకు హాజరు కానున్న పీవోలు, ఏపీవోలకు ఏయూ ఫంక్షన్ హాల్లో జరిగిన రెండో విడత శిక్షణ శిబిరాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు సమష్టిగా కృషి చేయాలన్నారు. పోలింగ్ రోజు అప్రమత్తంగా ఉండాలని, ఓపికతో పని చేయాలని పేర్కొన్నారు. ఓటర్లకు పూర్తి స్థాయిలో సహకారం అందించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐసీ డీఐవో చంద్రశేఖర్, అసిస్టెంట్ డీఐవో పాషా, దక్షిణ నియోజకవర్గ ఆర్వో సీతారామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు

కార్పొరేటర్ చెన్నాకు అరుదైన గౌరవం



గౌరవ డాక్టరేట్‌తో జానకీరామ్‌ని సత్కరిస్తున్న ప్రముఖులు

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ 37వ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్‌ను చిన్నారావు వెల్ఫేర్ సొసైటీ సంస్థ గుర్తించింది. నిత్యం సమాజ సేవలో ఉంటూ సేవలందిస్తున్న జానకీరామ్‌కు ఇంటర్నేషనల్ గ్లోబల్ పీస్ యూనివర్సిటీ (యుఎస్ఏ) సౌజన్యంతో సమాజ సేవా విభాగం కింద అవార్డు అందించింది. కేంద్ర వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ ఎస్‌కే రెహ్మాన్, అధ్యక్షుడు దోమల చిన్నారావు తదితరులు చెన్నాను ఘనంగా సత్కరించారు.

కిక్ బాక్సింగ్ కోచ్‌కు డాక్టరేట్



శ్రీనివాసరావుకు గౌరవ డాక్టరేట్ అందజేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

డాబాగార్డెన్స్ : చిన్నారావు చారిటబుల్ ట్రస్ట్ సేవా సంస్థ కిక్ బాక్సింగ్, కుంగ్‌ఫూలో అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకాలు సాధించడమే కాక ఎంతో మందికి శిక్షణ అందించిన నీలాపు శ్రీనివాసరావుకి గౌరవ డాక్టరేట్ అందజేసింది. దేశ రాజధాని ఢిల్లీలో గ్లోబల్ యూనివర్సిటీ, చిన్నారావు చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో వాణిజ్య టాక్స్ కమిషనర్, జీఎస్టీ కమిషనర్ రెహ్మాన్ చేతుల మీదుగా డాక్టరేట్ అందజేశారు.

ఘనంగా హజ్రత్ ఖామూష్‌వలీ బాబా చందనోత్సవం



చందన సమర్పణలో ముస్లింలు

డాబాగార్డెన్స్ : అల్లిపురం యాతపేటలో గల మసీదులో హజ్రత్ ఖామూష్‌వలీ బాబా చందనోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి పెద్ద ఎత్తున ప్రార్థనలు చేశారు. సాయంత్రం తిరువీధి ఉత్సవం అనంతరం నిర్వహించిన చందన సమర్పణలో భారీ సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

బ్యూటీఫుల్‌గా బస్‌బేలు

డెవలప్‌మెంట్ వాచ్



జగదాంబ జంక్షన్ వద్ద అందంగా రూపుదిద్దుకున్న బస్‌బే

దక్షిణ నియోజకవర్గ పరిధి పలు ప్రాంతాల్లో బస్ బేలను **ఆధునికీకరించారు.** నియోజకవర్గ పరిధిలో జగదాంబ జంక్షన్, ఎల్ఐసీ, ఆర్టీసీ కాంప్లెక్స్ ఇన్‌గేట్, లలితా జ్యూయలరీ వద్ద ఆధునికీకరించిన బస్ బేలు ప్రయాణికుల సౌకర్యార్థం అందుబాటులోకి వచ్చాయి. జగదాంబ జంక్షన్ వద్ద రూ.25.93 లక్షలు, ఎల్ఐసీ బిల్డింగ్ వద్ద రూ.26.33 లక్షలు, ఆర్టీసీ కాంప్లెక్స్ ఇన్‌గేట్ వద్ద రూ.24.73 లక్షలు, లలితా జ్యూయలరీ వద్ద రూ.26.45 లక్షలతో బస్ బేలను ఆధునికీకరించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో విశాఖ నగరం ప్రగతి సాధిస్తుందనడానికి ఈ అభివృద్ధే నిదర్శనం. సీఎం సూచనల మేరకు దక్షిణ అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో దక్షిణం అభివృద్ధిపథాన దూసుకుపోతోంది. ఆధునికీకరించిన బస్‌బేలను చూసి ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. – డాబాగార్డెన్స్



ఎల్ఐసీ బిల్డింగ్ వద్ద అద్భుతంగా తీర్చిదిద్దిన బస్‌బే



ఆర్టీసీ కాంప్లెక్ ఇన్‌గేట్ వద్ద ఆధునికీకరించిన బస్‌బేలో ప్రయాణికులు



లలితా జ్యూయలరీ వద్ద ఆకర్షణీయంగా మలిచిన బస్‌బే

సేవా ప్రాజెక్టులకు నిధులు మంజూరు



సత్కారం పొందిన రోటరీ ప్రముఖులతో నిర్వాహకులు

డాబాగార్డెన్స్ : రోటరీ ఇంటర్నేషనల్ మానవతా సేవా ప్రాజెక్టుల అమలుకు నిధులు మంజూరు చేస్తుందని, అలాగే ప్రపంచంలోని పర్యావరణ అసమతుల్యతను తగ్గించడానికి ప్రత్యేక ప్రాజెక్టులు కూడా చేపట్టిందని క్లబ్ జిల్లా గవర్నర్ ఎలెక్ట్ తెలిపారు. నగరంలోని ఓ హోటల్లో ఆదివారం రోటరీ జిల్లా సహాయ నిధి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇచ్ఛాపురం నుంచి అమరావతి వరకు గల 82 రోటరీ క్లబ్‌ల ప్రతినిధులు సదస్సులో పాల్గొన్నారని చెప్పారు. రానున్న కాలంలో మరిన్ని మానవతా సేవా కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన ప్రాజెక్టులు గుర్తించాలని పూర్వ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ సామ్ మువ్వ సూచించారు. ఆర్‌వీ సుబ్బారావు మాట్లాడుతూ మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు రోటరీ ఇంటర్నేషనల్ నుంచి మరిన్ని నిధులు పొందేందుకు సహకరించాలన్నారు. జిల్లా, రోటరీ ఇంటర్నేషనల్ నుంచి గ్రాంట్లు పొందడానికి అనుసరించాల్సిన మార్గదర్శకాలను జి. విశ్వనాథ్ వివరించారు. కార్యక్రమంలో సదస్సు చైర్మన్ కమల్ బైద్, క్లబ్ అధ్యక్షుడు ఆర్. రామకృష్ణారావు, సెమినార్ సెక్రటరీ యూఎస్ శర్మ, క్లబ్ సెక్రటరీ ఎస్ఎస్ఎన్ రాజు, కె. వెంకటరమణ, జీఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గానికి సత్కారం



బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులతో అతిథులు

డాబాగార్డెన్స్ : మానవహక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎస్ఎన్ఎల్‌యూ ఫస్ట్ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ వై. సత్యనారాయణ పేర్కొన్నారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం 'హ్యూమన్ రైట్స్ డిఫెండర్స్ మీట్' పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ 25 ఏళ్లుగా హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కౌన్సిల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తాజాగా అమల్లోకి తీసుకొచ్చిన పలు చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో విశాఖ బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సత్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు బెవర సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు ఇమంది శ్రీనివాసరావు, కార్యదర్శి నరేష్‌కుమార్‌తో పాటు పోలీస్ కంప్లైంట్ అథారిటీ సభ్యులు కె. రంగరాజు, రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ ఎస్. దివాకర్‌ను సత్కరించారు. భవిష్యత్‌లో బార్ అసోసియేషన్ తరఫున మానవ హక్కుల సంఘానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్‌కు చెందిన వివిధ జిల్లాల సభ్యులు పాల్గొన్నారు.

అందరూ బాగుండాలనే భావన ప్రధానం

- జీవితం ఒక నడకగా భావించాలి
- ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు



గరికపాటి దంపతులను సత్కరిస్తున్న వాకర్స్ క్లబ్ కార్యవర్గ సభ్యులు

ఏయూ క్యాంపస్: సమాజంలో అందరూ బాగుండాలని ప్రతి వ్యక్తి ఆకాంక్షించాలని ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు అన్నారు. సీషోర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వీఎంఆర్‌డీఏ పార్కు ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన లోక కల్యాణం కోసం ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. జీవితాన్ని ఒక నడకగా భావించాలన్నారు. ఎవరిపైనా ఆధారపడకుండా మన నడక మనం సాగిస్తామని, అదే విధంగా జీవితంలో ముందుకు సాగాలన్నారు. సంసారాన్ని సాగరంతో పోలుస్తారని, ఇక్కడ ఉన్న వారు సాగరాన్ని చూస్తే ఎన్నో జీవిత సత్యాలు తెలుసుకోవచ్చునన్నారు. నేను అనే భావన మన మనసుల్లో తొలగాలన్నారు. మన స్థితి, గ్రహస్థితి బాగుండాలంటే పరమేశ్వరుడిని మన హృదయంలోకి ఆహ్వానించాలని సూచించారు. సమాజంలో వ్యాపార ధోరణి లేదని, మనిషి మనస్సులో ఉన్న వ్యాపార ధోరణిని ముందుగా తరిమివేయాలని పిలుపునిచ్చారు. కష్టాలను అధిగమించే ధైర్యాన్ని ఇవ్వాలని దైవాన్ని అడగాలన్నారు. వైరాగ్యాన్ని అవలంబిస్తే జీవితం వైకుంఠంగా మారుతుందన్నారు. మనకు ఉన్నది చాలు అనే భావనే వైరాగ్యమన్నారు. సూర్యభగవానుడి దశలను పరిశీలిస్తే మన జీవితానికి దగ్గరగా ఉంటుందన్నారు. పురాణాలను వైజ్ఞానికంగా అర్థం చేసుకోవాలని సూచించారు. అనంతరం గరికపాటి దంపతులను సీషోర్ వాకర్స్ క్లబ్ సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు డి.శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి జి.తిరుపతిరావు, కోశాధికారి ఎం.ఎస్.నాయుడు, క్లబ్ సీనియర్ సభ్యులు పాల్గొన్నారు.

సింహగిరిపై ఆర్జిత సేవల పునరుద్ధరణ

సింహాచలం: సింహగిరిపై వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో ఆదివారం నుంచి ఆర్జిత సేవలు పునరుద్ధరించారు. స్వామివారి వార్షిక కల్యాణోత్సవాలను పురస్కరించుకుని గతనెల 18 నుంచి ఈనెల 4వ తేదీ వరకు ఆర్జిత సేవలన్నీ రద్దు చేసిన విషయం తెలిసిందే. తిరిగి ఆదివారం నుంచి ఆర్జిత సేవలు ప్రారంభించారు.

వైభవంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం గరుడసేవ వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వెండి గరుడ వాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని అధిష్టంపజేశారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. భక్తులను గరుడ వాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం సహస్ర నామార్చన శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంప జేశారు. వెయ్యి నామాలతో స్వామికి అర్చన చేశారు. భక్తులకు తులసి ప్రసాదం అందజేశారు.

ట్రెకింగ్ శిబిరానికి పయనమైన ఎన్‌సీసీ క్యాడెట్లు

సీతంపేట: తమిళనాడు రాష్ట్రం ఊటీలో జరిగే ఆల్ ఇండియా ట్రెకింగ్ శిబిరానికి అక్కయ్యపాలెం ఎన్‌జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ ఎన్‌సీసీ క్యాడెట్లు మంగపూడి శృతి, జరజాపు శ్రావణి ఎంపికయ్యారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 520 మంది క్యాంప్‌లో పాల్గొంటున్నారని, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి 31 మంది క్యాడెట్లు వెళ్తున్నారని పాఠశాల ఎన్‌సీసీ అధికారి ఎం.ఎస్.వి.విశ్వనాథం, సుబేదార్ జయప్రకాష్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఆదివారం ఉదయం రైలులో ఊటీ పయనమయ్యారు. ఎన్‌సీసీ యూనిట్ అధికారి కల్నల్ అజయ్‌కుమార్, హెచ్‌ఎం లక్ష్మీనరస ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని నేతల ప్రచారం



వైఎస్సార్ సెంట్రల్ పార్క్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు

డాబాగార్డెన్స్ : వైఎస్సార్ సెంట్రల్ పార్క్ ఆవరణలో ఆదివారం ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మి, ఎమ్మెల్యేగా వాసుపల్లి గణేష్‌కుమార్‌ను గెలిపించాలని 33వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు బొడ్డేటి ప్రసాద్, పాల శ్రీహరిరెడ్డి, పల్లేటి శివ, కణితి బ్రహ్మం, కొడమంచిలి శ్రీను, కొరిబిల్లి త్రినాథ్ ప్రచారం చేశారు. వైజాగ పటం కార్యదర్శి రాజా పాత్రుడు, వేంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్ బొడ్డేటి కిషోర్ నేతృత్వంలో వాకర్లతో సమావేశమై వైఎస్సార్ సీపీని గెలిపించాలని అభ్యర్థించారు. సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం కొనసాగుతాయని వాకర్లకు తెలిపారు.

నేడు మత్స్యకారులకు ఉచిత వైద్య శిబిరం

డాబాగార్డెన్స్ : పెదముత్యాలు స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పుష్పగిరి కంటి ఆస్పత్రి సహకారంతో సోమవారం మత్స్యకారులకు ప్రత్యేక ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు చింతకాయల అమ్మోరు ఒక ప్రకటనలో తెలిపారు. గత మూడేళ్లుగా 2599 మందికి కంటి లేజర్ ఆపరేషన్లు చేసినట్లు తెలిపారు. 50 ఏళ్లు పైబడిన ప్రతి మత్స్యకారుడు, సముద్రంలో వేటాడే వారు, మత్స్యకార మహిళలు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉప్పు చేప వ్యాపారులకు ఉప్పు వల్ల చర్మం నల్లబడి, కంటి కింద చిన్నపాటి కురుపులు రావడం వల్ల కళ్లు దెబ్బతింటాయని చెప్పారు. అటువంటి వారు సోమవారం ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు ఫిషింగ్ హార్బర్ గేటు వద్ద నిర్వహించే శిబిరానికి రావాలని తెలిపారు. పరీక్షలు నిర్వహించి ఉచితంగా వాహనం ఏర్పాటు చేసి ఖర్చు లేకుండా డాక్టర్ రాజు సహకారంతో శస్త్ర చికిత్సలు చేయనున్నట్లు చెప్పారు. శిబిరంలో పాల్గొనే మత్స్యకారులు ఆధార్, ఆరోగ్యశ్రీ కార్డు, బ్యాంకు పుస్తకం తీసుకు రావాలని సూచించారు.

మలేషియాలో 10 నుంచి శాంతి సదస్సు

మద్దిలపాలెం : మలేషియా రాజధాని కౌలాలంపూర్‌లో ఈ నెల 10 నుంచి 15వ తేదీ వరకూ మనుజ్యోతి ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ శాంతి సదస్సు జరగనున్నట్లు ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మొనీ, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడం సంస్థ చైర్మన్ నరవ ప్రకాశరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుల్లో పాల్గొనాలంటూ తనకు ఆహ్వానం అందిందని పేర్కొన్నారు. సర్వమత సౌభ్రాతృత్వం, సమాజ సేవ అంశంపై నివేదిక సమర్పించనున్నట్లు తెలిపారు.

ప్రైవేటీకరణతో దేశానికి ముప్పు



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: దేశ ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వ రంగ సంస్థలే ఆధారమని, అటువంటి సంస్థలను ప్రైవేటీకరించడం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ పతనమవుతుందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 1179వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మిక వర్గాన్ని, నిర్వాసితులను, నిరుద్యోగులను నడిరోడ్డుపై పడేసే విధంగా కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందన్నారు. వాటిని ఉద్యమాల ద్వారా అడ్డుకుంటామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

వెల్లువలా వైఎస్సార్‌సీపీలోకి

- పార్టీలో చేరుతున్న పలువురు నాయకులు.. కార్యకర్తలు
- చర్చిల్లో ప్రార్థనలు చేసిన వాసుపల్లి



ట్రినిటీ లూథరన్ చర్చిలో ప్రార్థన చేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్



పార్టీలో చేరిన జనసేన కార్యకర్తలు, నాయకులతో వాసుపల్లి గణేష్‌కుమార్



పార్టీలో చేరిన రెడ్డి యంగ్ బాయ్స్‌తో వాసుపల్లి గణేష్‌కుమార్



పార్టీలో చేరిన శెట్టిబలిజలతో వాసుపల్లి

డాబాగార్డెన్స్ : హోమియో రంగంలో విశేష సేవలందించిన డాక్టర్ ఎండీ రియాజ్ అహ్మద్ వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆదివారం హోమియో ఆస్పత్రి ప్రాంగణంలో ఆయనకు వాసుపల్లి గణేష్‌కుమార్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా డాక్టర్ రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదలకు చేసిన అనేక సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి, జగనన్నపై మరింత ఇష్టం పెంచాయన్నారు. దక్షిణలో వాసుపల్లి గణేష్‌కుమార్ తన సొంత నిధులతో ప్రజాదర్బార్‌లు నిర్వహిస్తూ నియోజకవర్గ ప్రజలతో మమేకమై ఉన్నారన్నారు. ఆ సేవలు చూసిన తనకు వైఎస్సార్‌సీపీలో చేరాలనిపించిందన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావాలని ఆకాంక్షించారు. పార్టీ నాయకుడు పోటోజు ప్రసాద్ నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కోసూరు సురేష్, గురజాపు రవి, బాబ్జి, పెదబాబు, చిన్ని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలోకి..

జీవీఎంసీ 38వ వార్డు నుంచి పలువురు జనసేన కార్యకర్తలు ఆదివారం వాసుపల్లి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరంతా ఇటీవల జనసేన పార్టీలో చేరి, ఆ పార్టీ విధి విధానాలు నచ్చక వైఎస్సార్‌సీపీలో చేరినట్టు తెలిపారు. దక్షిణ నియోజకవర్గంలో వాసుపల్లి సేవలు, రాష్ట్రంలో జగనన్న పాలన చూసి పార్టీలో చేరినట్టు చెప్పారు. కోసూరు సురేష్, గురజాపు రవి, బాబ్జి, పెదబాబు నేతృత్వంలో అనూష, అనుమోలు, బ్రహ్మజీ, కె. మధు తదితరులు పార్టీలో చేరారు.

వాసుపల్లికి చర్చి ఫాదర్ల ఆశీర్వచనాలు..

నియోజకవర్గ పరిధి జగదాంబ జంక్షన్‌లోని ట్రినిటీ లూథరన్ చర్చిలో వాసుపల్లి గణేష్‌కుమార్ ఆదివారం క్రిస్టియన్ మైనార్టీ చైర్మన్ బొల్లవరపు జాన్‌వెస్లీతో కలిసి ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం చర్చి ఫాదర్లు ప్రార్థనలు చేసి వాసుపల్లి గెలుపొందాలని ఆశీర్వదించారు. జేసీఎస్ మండల అధ్యక్షుడు కోడిగుడ్ల శ్రీధర్, పార్టీ నేత బొడ్డేటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్రిస్టియన్ మైనార్టీలకు సముచిత స్థానం..

అనంతరం 36వ వార్డులో పార్టీ నేత రెయ్యి డేవిడ్‌రాజు పిలుపు మేరకు వాసుపల్లి ఏవీఎన్ కళాశాల సమీపంలో గల చర్చికి వెళ్లి ఆశీర్వచనాలు పొందారు. క్రిస్టియన్లు వాసుపల్లిని ఆప్యాయంగా పలకరిస్తూ మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిస్టియన్ మతంతో విద్యార్థి దశ నుంచే సత్సంబంధాలు ఉన్నాయన్నారు. జీసస్ అంటే తన మనసులో ప్రత్యేక స్థానం ఉందన్నారు. క్రిస్టియన్ మైనార్టీలకు సముచిత స్థానం కల్పించిన ఏకైక పార్టీ వైఎస్సార్‌సీపీ అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా గెలపించుకోవాలని పిలుపునిచ్చారు.

పార్టీలో చేరిన రెడ్డి యంగ్ బాయ్స్ సభ్యులు..

జగదాంబ : జీవీఎంసీ 35వ వార్డు పండా వీధికి చెందిన రెడ్డి యంగ్ బాయ్స్ వార్డు అధ్యక్షుడు అలవన కనకరెడ్డి ఆధ్వర్యంలో వాసుపల్లి గణేష్‌కుమార్ సమక్షంలో పార్టీలో చేరారు. వాసుపల్లి కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన శెట్టిబలిజలు..

జీవీఎంసీ 35వ వార్డు కల్లుపాకలు ప్రాంతానికి చెందిన శెట్టిబలిజ కులస్తులు వార్డు అధ్యక్షుడు కనకరెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వారికి వాసుపల్లి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

అస్తవ్యస్తంగా దేశ రాజకీయాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పిరమిడ్ పార్టీ ప్రతినిధులు

డాబాగార్డెన్స్ : ఈ ఎన్నికల్లో శాకాహారులనే ఎన్నుకోవాలని, మరీ ముఖ్యంగా ధ్యాన యోగులు, ఆత్మజ్ఞానులనే ఎన్నుకోవాలని పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా విశాఖ ఎంపీ అభ్యర్థి పి. సత్యవాణి పిలుపునిచ్చారు. ఈ మేరకు 2024 ఎన్నికల్లో నిర్వహించే తమ పార్టీ కార్యకలాపాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేడు దేశ రాజకీయాలు అస్తవ్యస్తంగా ఉన్నాయని, అందుకు కారణం ఆత్మ మేధావులు రాజకీయాల నుంచి దూరంగా ఉండడమే అన్నారు. ఆత్మజ్ఞానం లేనిదే ఎవరూ ఆత్మ మేధావులు కాలేరని తెలిపారు. ఆత్మజ్ఞానులు పాలకులైనప్పుడే ప్రపంచం బాగుపడుతుందని చెప్పారు. పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియాకి ఆ ఉపదేశమే జీవనాడిగా పేర్కొన్నారు. తమ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా పోటీ చేస్తుందని తెలిపారు. ఫ్లూట్ గుర్తుపై ఓటు వేసి పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారి రమ, ఆ పార్టీ పెందుర్తి నియోజకవర్గ అభ్యర్థి రోజా, మూర్తి, సత్యవతి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

నవ్వుల సునామీ సృష్టించిన లాఫింగ్ క్లబ్‌లు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న లాఫింగ్ క్లబ్‌ల ప్రతినిధులు

డాబాగార్డెన్స్ : ప్రపంచ నవ్వుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో లాఫర్స్ ఫన్‌క్లబ్ నిర్వహించిన కార్యక్రమం నవ్వుల సునామీ సృష్టించింది. నగరంలో గల అన్ని కామెడీ క్లబ్‌ల సభ్యులు తమవైన కామెడీ స్కిట్స్‌తో నవ్వుల హోరు సృష్టించారు. లాఫర్స్ ఫన్ క్లబ్ వ్యవస్థాపక కార్యదర్శి కోరుకొండ రంగారావు నిర్వహణ, వ్యాఖ్యానం చేయగా, అధ్యక్షుడు జీవీ త్రినాథ్ పర్యవేక్షణలో, సంయుక్త కార్యదర్శి దుర్గాప్రసాద్, కార్యనిర్వాహక కార్యదర్శి యోగా భాస్కర్ సహకారంతో కార్యక్రమం ఆద్యంతం నవ్వుల జల్లులు కురిసాయి. ముందుగా ఆర్‌వీవీ సత్యనారాయణ ప్రార్థనా గీతం ఆలపించగా, బేబీ కె. ధన్యారెడ్డి సాంప్రదాయ నృత్యాలతో ప్రారంభమైన ఈ కార్యక్రమం.. సంస్థ సభ్యులు జీవీ త్రినాథ్, కోరుకొండ రంగారావు, పీకే దుర్గాప్రసాద్, ప్రవీణ్, పోర్టు శేషు, అన్వేష్, ఎస్ఎస్ నాయుడు, జోషిత, లక్ష్మి సూపర్ సర్జన్, గంటకి కేజీ, సెల్‌ఫోన్ వ్రతం, సినిమా కథ, విడాకులు, జ్యోతిష్యం తదితర స్కిట్స్‌తో నవ్వులు పంచారు. జబర్దస్త్ అప్పారావు, సత్తిపండు తమ హాస్యంతో ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. ప్రముఖ సినీ నటుడు ప్రసన్నకుమార్, జబర్దస్త్ అప్పారావు, సత్తిపండులను సీతారామస్వామి, పైడి శంకర్రావు, పెదిరెడ్ల శ్రీనివాస్ సన్మానించారు. విశాఖ హ్యూమర్‌క్లబ్, హాస్యప్రియ కామెడీ క్లబ్, ఫ్రెండ్స్ కామెడీ క్లబ్, హైదరాబాద్ కామెడీ క్లబ్, బాబాయి కామెడీ క్లబ్, అనకాపల్లి లాఫింగ్ క్లబ్ సభ్యులు చక్కటి హాస్యం పండించి ప్రేక్షకులను అలరించారు.

అలరించిన 'వినోదాల విందు'

సీతంపేట: ప్రపంచ నవ్వుల దినోత్సవం సందర్భంగా ఫ్రెండ్స్ కామెడీ క్లబ్, హైదరాబాద్ హ్యూమర్ క్లబ్ సంయుక్తంగా ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన వినోదాల విందు ఆద్యంతం అలరించింది. సంస్థ వ్యవస్థాపకుడు ఎం.వి.సుబ్రహ్మణ్యం, జబర్దస్త్ ప్రకాష్, జె.ఎల్.నరసింహం, కె.ఎల్.కామేశ్వరరావు, డేవిడ్ రాజు, కుమారి, రావి గోపి, భాను ప్రకాష్, శివజ్యోతి, ఇమంది ఈశ్వరరావు, దుర్గాప్రసాద్, భాస్కరాచారి ప్రదర్శించిన కామెడీ స్కిట్లు కడుపుబ్బా నవ్వించాయి. వీటిలో ఆక్సిడెంట్ రక్షించి, డాక్టర్ పేషెంట్, విడాకులు, మ్యారేజ్ బ్యూరో, పార్టీ, ఇంటర్వ్యూ స్కిట్స్ ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తాయి.